

# పుట్టినరోజు

'శ్రీవిరించి'

దశాబ్దాలు గడిచే కొద్దీ రాజకీయ, వైజ్ఞానిక, సామాజిక రంగాలన్నింటి పరిణామక్రమంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ మార్పులన్నీ మనిషి జీవనగతిపై ఆలోచనారీతిపై ప్రభావం చూపిస్తూనే ఉంటాయి.

సమాజంలో, మానవ జీవితంలో వచ్చిన మార్పులే రచయితల భావసరళిని, ఆలోచనా శక్తిని ప్రభావితం చేస్తాయి. తత్ఫలితంగా రచయిత ఎన్నుకొనే ఇతివృత్తం మారుతుంది. సమస్యం స్వరూపం మారుతుంది. రచనా సంవిధానం మారుతుంది. ఏదిమారినా మౌలికమైన సాహిత్యపు విలువలు మారవు. మారని ఈ విలువలున్న కథైనా, నవలైనా మరే ఇతర రచనైనా అది ఈతరం రచయిత రచించినదైనాగాని, సాహిత్యాభిమానుల ఆదరణను చూరగొంటుంది. కాలాతీతమైన విలువల్ని ఆవిష్కరిస్తుంది. అందులో సందేహం లేదు.

ఈ విలువల్ని ఎత్తి చూపే ప్రయత్నంలో భాగంగా ఈనాటి కథకుల విలువైన రచనల్ని ఆహ్వానం మీకు అందిస్తోంది.

**విశాలమైన రోడ్ మీద సునాయాసంగా ప్రయాణం చేస్తోంది సిటీబస్. ఉదయం తొమ్మిదిన్నర. స్కూళ్లు ఆఫీసులు ఉన్నరోడ్డుకాదు. అందుచేత బస్ కిక్కిరిసి ఉండక పోవడమేకాక, సగానికి సగం కాళీ.**

'శుభసదను' ముందు ఆగింది.

లోపలనుంచి పధ్నాలుగేళ్ల అమ్మాయి ఛంగున రోడ్డుమీదకు దూకింది. గులాబీ రంగు మిడ్డీ వేసుకుంది. కాళ్లకు తెల్లటి కాన్‌వాస్ బూట్లు, మోకాళ్లదాక బూడిద రంగు సాక్స్, మెడలో లేతనీలం రంగు స్కార్ఫ్ ఎడమ చేతి మణికట్టుకు పావలా కాసంత గడియారం.

ఆ అమ్మాయి చేతుల్లో కాగితం పొట్లాంలో చుట్టిన అడుగున్నర పొడగాటి 'పుష్పగుచ్ఛం' వుంది. రకరకాల రంగుల్లో చక్కగా అమరిన పువ్వులు, మధ్య మధ్య పచ్చని ఆకులు. ఆ గుచ్ఛాన్ని అలవోకగా రెండుచేతుల్లోనూ పట్టుకుని రోడ్డు దిగి సదనం వైపు నడిచింది.

గేటు దగ్గర్నుంచి భవనాల వరకు రెండు కార్లు వరసగా వెళ్లటానికి వీలయిన వెడల్పాటి కాలిబాట. బాటకు రెండు పక్కలా ఆరు అంగుళాల ఎత్తులో నీలిరంగు పూలమొక్కలు. తోటపనివాళ్లు ఈ ఆవరణ అంతటినీ తల్లిలా సాకుతున్నారనటానికి అడుగడుగునా సాక్ష్యాధారాలు. పది నిమిషాలు నడిచినా అలసట అనిపించలేదు. ఛంగు ఛంగున లేడిపిల్లలా పరుగులు తీసే వయస్సు. దానికి తోడు సులలితంగా ఆహ్వానించే వాతావరణం.

రిసెప్షన్ కౌంటర్ ముందు ఆగింది.

'ఎవరి కోసం?' అనడిగింది కౌంటర్లో వున్న యువతి.

'ఎవరయినా సరే!.

ప్రశ్నార్థకంగా చూచింది ఆ యువతి. తర్వాత 'నీ పేరు?' అంది.

'ప్రశ్న'

'ప్రసూనా?'

'లేదు. ప్రశ్న.'

రిసెప్షనిస్ట్ యింకేమీ అడగలేదు. 'నీకు ఇక్కడెవరూ తెలియదన్నమాట. సరే. ఉండు. చెబుతాను.' అంటూ బెల్ మోగించింది.

మరు నిముషంలో ఆయాలాంటి ఓ మనిషి వచ్చింది.


'జయమ్మా, ఈ అమ్మాయిని జగదాంబ గారి గదికి తీసుకువెళ్లు. నీవేం పరిచయం చేయనక్కర్లేదు. గది తలుపు తెరిపించి వచ్చేసెయ్యి.'

'అలాగేనమ్మా-' అని ఆయా జయమ్మ ప్రశ్నను లాలనగా చేయి అంది పుచ్చుకుంది.

ప్రశ్న ఆమె వెంట - కూడా - నడిచింది.

రెండో అంతస్తులో పదహారో గది.

తలుపుమీద చప్పుడు చేసిన వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.



"శ్రీ విరించి"

ఓ యాభయి యేళ్ల ఆమె తలకాయ ముందుకు పెట్టి'నువ్వా, జయమ్మా' అంది.

జయమ్మ వెనక్కు వెళ్లిపోయింది.

గదిలో ఉన్నామె 'ప్రశ్న'ను గమనించి ఆపిల్ల చేయిపట్టుకుని గబుక్కున గదిలోపలకు లాక్కుంది. ఈ చర్యకు, ప్రశ్న ముందు కాస్త ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. ఒక్క నిమిషం లోనే తేరుకుని గదంతా పరిశీలనగా చూచింది.

ప్రశ్నను గదిలోనికి లాగినాక, తలుపులు మళ్లీ బిగించి, గడియ పెట్టింది. అది చిన్నగది అనడానికి వీలులేదుగాని గది నిండా ఫర్నిచర్ వుండడం వల్ల చాల యిరుక్కుపోయినట్లు అనిపిస్తోంది. రెండు మంచాలు దోమతెరలు మడిచి పైకి వేసి వున్నాయి. ఓ లగేజ్ రాక్ దానిమీద రెండు భారీ సూట్‌కేసులు ఎదురు బొదురుగా వున్నాయి. ఓ టేబుల్ మీద అద్దం, దువ్వెన-- యింక యితర చిన్న చిన్న వస్తువులు. మూడు కుర్చీలు, మూలగా ఓ టీపాయ్, దానిమీద టేప్ రికార్డర్, ట్రాన్సిస్టర్.

ప్రక్కగదిని పరిశీలిస్తూ వుండగానే ఆమె అడిగింది. 'అయితే నిన్ను మీ స్కూలు వాళ్లు పంపించారన్నమాట!'

'నన్నెవరూ పంపించలేదు. నేనే వచ్చాను' అంది ప్రశ్న, గదిలోనికి తనను లాక్కున్న ఆమె కాక మరో అదే వయస్సు ఆమె ఓ మంచం మీద కూర్చుని వుండడం గమనించింది, ఈ సరికి ప్రశ్న.

'ఎక్కడ చదువుతున్నావు?' అని అడిగింది ఈమారు ఆమె.

ప్రశ్న చెప్పింది, ఎన్నో క్లాసో కూడా చెప్పింది.

'ఎవరికోసం వచ్చావు?'

ప్రశ్నకు యేం జవాబు చెప్పాలో తెలియ లేదు. ఎవరయినా ఇదే ప్రశ్న వేస్తున్నారేమిటి? ఎవరయితే తనకేం? ఏదో ఒక జవాబు చెప్పేస్తే బాదర బందీ వుండదు గనుక, ఇందాక రిసెప్షనిస్ట్ చెప్పిన పేరు మనసులో మెదలగా ఠక్కున 'జగదాంబగారికోసం-' అంది.

మంచం మీద కూర్చున్న ఆమె ఒక్కమా

ఆ అమ్మాయి చేతుల్లో కాగితం పొట్లాంలో చుట్టిన అడుగున్నర పొడగాటి 'పుష్పగుచ్ఛం' వుంది. రకరకాల రంగుల్లో చక్కగా అమరిన పువ్వులు, మధ్య మధ్య పచ్చని ఆకులు, ఆ గుచ్ఛాన్ని అలవోకగా రెండు చేతుల్లోనూ పట్టుకుని రోడ్డు దిగి సదనం వైపు నడిచింది.

రుగా ఎగిరిగంతు వేసినట్లుగా కిందకు దూకింది. ప్రశ్నను జబ్బ పట్టుకు లాగినంత పనిచేసింది. తన దగ్గరకు తీసుకుంది. 'రావ్మూ - రా - కూర్చో, ఇంట్లో అంతా కులాసానా?' అంది.

ప్రశ్నకు ఉక్కిరి బిక్కిరి అయింది.

- ఈ జగదాంబగారిని తాను ఎరగదు, ఎన్నడూ చూడనయినా లేదు. అయినా ఈమె తనను తన కుటుంబాన్ని తెలిసినట్లుగా మాట్లాడుతోంది!

మొదటి ఆమె కలుగచేసుకుని పరిస్థితి కాస్త సజావుగా మళ్లేందుకు దోహదం చేసింది. 'చిన్నపిల్లను ఊరికే ఉక్కిరిబిక్కిరి చేయకు, జగదాంబా', అని ప్రశ్నతో ఇటు రావ్మూ, ఈ కుర్చీలో కూర్చో' అంది.

'నేనేం ఉక్కిరి బిక్కిరి చేయడం లేదు. నువ్వూరుకో, ఈ అమ్మాయి నా కోసం వచ్చింది. నా కుర్చీలోనే కూర్చోవాలి' అంది జగదాంబ.

'ఏ కుర్చీ అయితేనేం? అన్నీ "సదనం" వాళ్ల కుర్చీలేగ, ఇందులో నీది నాది అని యేముంది యిక్కడ?'

'ఊహు, సీట్లో గుంటపడకుండా ఉన్న కుర్చీ నాది. • ఎన్నిసార్లు చెప్పాలి నీకు? నీ శరీరంతో చూసు ఆ కుర్చీ ఎలా గుంట పడవేశావో, ఊబవొళ్లు నీవూను!'

-మొదటి ఆమె నవ్వుకుంది. తర్వాత ప్రశ్నతో 'పోనీలే, అమ్మా ఆ కుర్చీలోనే కూర్చో' అంది.

ఇక్కడ గదుల్లో యిద్దరు వుంటారని తెలియదు. లేకపోతే రెండు పుష్పగుచ్ఛాలు తెచ్చేదాన్ని. ఇప్పుడు దీన్ని ఎవరికి ఇవ్వడం?......తను ఎలాగూ జగదంబ గారి మనిషి అయిపోయిందిగా. అందుచేత కూర్చోవటానికి ముందు, పుష్పగుచ్ఛాన్ని సగౌరవంగా ప్రేమగా ఆమె చేతుల్లో వుంచింది, వినయంగా నమస్కారం చేసింది.

'మా తల్లే..మా తల్లే. ఎంత మంచిదానవమ్మా నువ్వు -' అని జగదాంబ పుష్పగుచ్ఛం చూస్తూ కొన్ని నిమిషాలు మురిసిపోయింది. తరువాత, అలమారులో ఒక అర ఖాళీచేసి దుమ్ముదులిపి దాన్లో గుచ్ఛాన్ని అమర్చింది.

'ఎవరమ్మా తయారుచేసింది యిది? అబ్బ...... ఎంత బాగుందో! దీనివల్ల గదికే శోభ వచ్చింది' అంది మొదటి ఆమె.

'ఇదిగో సుందరమ్మా, నాకు వచ్చిన ప్రెజెంట్‌ను గురించి నీవు మాట్లాడగూడదు. నాకు కోపం వస్తుంది' అంది జగదాంబ. కోపం వచ్చినట్లుగానే ఆమె ముఖం మార్చడం చూచి ప్రశ్న నవ్వుకుంది.

'సర్లే, నీ కోపమూ నువ్వూను,' అంది సుందరమ్మ.

'కాసేపు నువ్వు నోరుమూసుకుని కూర్చుంటావా?......నేను, మా అమ్మాయి మాట్లాడుకోవాలి!'

'నీ అతి ఆప్యాయతతో అమ్మాయిని హడలగొట్టేస్తావేమోనని నా భయం... అందుకనే కదలకుండా కూర్చున్నాను. లేకపోతే యిందాకే బయటకు పోయేదాన్ని.'

'సుందరమ్మగారూ, మీరూ- జగదాంబ గారూ తోటికోడళ్లు అనుకుంటాను, అంది ప్రశ్న. జగదాంబ ముందు నిర్ఘాంత పోయింది. తరువాత నోరారా నవ్వింది. సుందరమ్మగారు మాత్రం తాపీగా 'ఇక్కడకు వచ్చిన తర్వాతనే తల్లీ మాకు ఈవైరం, ఈనేస్తం. అంతవరకు మేం ఒకళ్ల ముఖం ఒకళ్లం యెరగం' అంది.

'మాబోటి వాళ్లకు ?యెప్పుడూ ఒక తోడు వుండాలి. అందుకనే మా యిద్దర్నీ ఒక గదిలోనే వుంచారు. సుందరమ్మ పైకి అలా మాట్లాడుతుంది గాని నిజానికి బహు మెత్తటి మనిషి,' అంది జగదాంబ.

'జగదాంబ మాటలు పట్టించుకోకు, అమ్మాయీ. ఇంతకూ నీపేరు యేమిటన్నావు?'

'ప్రశ్న'

'ప్రశ్నా?'

'అవును'

'చాలా మంచి పేరమ్మా, పూర్వకాలపు పేర్లు ప్రేమ - భామలాంటివి కాకుండా మధ్యయుగం పేర్లు కూడ దాటిపోయి ఇప్పటి యువతరం మంచిపేర్లు పెడుతున్నారు పిల్లలకు. మీ నాన్ననీ, అమ్మనీ అభినందించాలి' అంది.

తనపేరు ప్రస్తావన వచ్చినప్పుడు ప్రశ్నకు కొత్త ఉత్సాహం ఉబికి వస్తుంది.

'అసలు నాకు ఈ పేరు ఎందుకు పెట్టారో చెప్పానా అండీ?'

'చెప్పు - చెప్పు - ' అన్నారు ఇద్దరూ ఆతురతగా.

'మా అమ్మ నన్ను కడుపుతో వున్నప్పుడు----'

'మీ అమ్మమ్మా వాళ్లు వచ్చి సూడిదలు ఇచ్చారా తల్లీ, మీ అమ్మకు' అని అడిగింది జగదాంబ.

'సూడిదలు - గాడిదలు - తర్వాత. ముందు అమ్మాయి చెప్పేది విను.'

'మధ్యలో నిన్ను రావద్దన్నాను-'

ప్రశ్న దిగాలు పడిపోయి 'పోనీలెండి, మీకు ఇంటరెస్ట్ లేకపోతే చెప్పను-' అంది .

అమ్మాయి చిన్నబుచ్చుకున్నందుకు వాళ్లిద్దరికీ బాధ అనిపించింది. 'చెప్పమ్మా - చెప్పు-' అన్నారు యేకకంఠంతో.

'ఇంతకూ నా పేరండి.... మా అమ్మ కడుపుతో వున్నప్పుడు--మగపిల్లవాడా ఆడపిల్లా అని మా అమ్మా నాన్న పంతాలు పడిపోయారుటండీ---'

'మా అమ్మకు ఆడపిల్ల కావాలని వుండేది!' 'కాదండీ. అమ్మకు - అమ్మమ్మకు - నాయనమ్మకు కూడా ముగ్గురికీని - కొడుకే కావాలని వుండేది.'

'పాపం. ఎందుకనో!'

'ఎందుకనో తెలియదండీ. నాన్నకు తాతయ్యకు తాతాగారికీ ముగ్గురికీ మాత్రం కూతురయితే మంచిదని వుండేదటండీ!'

'అయితే నువ్వు మగవాళ్ల మాటే ఖాయం చేశావన్నామాట!'

'మరేమోనండీ, అప్పుడు--- మా అమ్మ, అమ్మమ్మ కలిసి ఒక శాస్త్రులు గారి దగ్గరకు వెళ్లారుటండీ!'

'ఎందుకూ?' అడిగింది జగదాంబ.

'ఎందు కేమిటి? ప్రశ్న అడగటానికి-' అంది సుందరమ్మ.

'అయితే శాస్త్రులు యేం చెప్పారమ్మా? పిల్లేనని చెప్పాడా, లేదా?'

'లేదండీ. ఒక వారం పోయాక రమ్మన్నాడటండీ ముందు...'

'ఒహో! అప్పటికి నువ్వుకూడా నిర్ధారణ చేసుకోలేదన్నమాట!'

'ఏమోనండీ!' వారం రోజులు పోయాక మళ్లీ వెళ్లారుటండీ. ఈ మారు మా అమ్మ, నాయనమ్మా కలిసివెళ్లారుట!

'ఈమారు యేం చెప్పాడమ్మా?'

'మరో పదిహేను రోజులు పోయాక ఎవరేనా మగవాళ్లను కూడా వెంటబెట్టుకు రమ్మన్నాడటండీ!'

'మగవాళ్లెందుకూ, వాళ్ల ముఖం ఈడ్చా!'

'ఎందుకో తెలీదండీ.

'ఊ... తర్వాత?' అంది సుందరమ్మ, కథ జాప్యం అయిపోతూ వుడడం సహించలేక.

'అప్పుడు మానాన్న, అమ్మ కలిసి వెళ్లారటండీ!'

'ఊ. చెప్పు-'

'మా నాన్న దగ్గర ఫీజు పదిరూపాయిలు తీసుకున్నాడటండీ ముందుగానే. తర్వాత చెప్పడట కొడుకేనని!'

'ఎంత దొంగముండావాడు ఆ శాస్త్రులు!' 'మా అమ్మ, అమ్మమ్మ, నాయనమ్మ ఎంతో సంతోషించారుటండీ!'

'నువ్వు పుట్టేంత వరకూ :-!

'నేను పుట్టాక వాళ్లు ముగ్గురూ కలిసి శాస్త్రులుగారి యింటికి దండయాత్రకు వెళ్లారటండీ!'

'వాళ్లెవరోగాని, నీ సజ్జే జగదాంబ' అంది సుందరమ్మ.

'నేనయితే రోకలిబండ తీసుకుని దంచి పారేసే దాన్ని. ఆడపిల్ల గురించి అబద్ధాలు చెబుతాడా?.... అందులోనూ పదికరుకు రూపాయిలు తీసుకుని!'

'వినండి, జగదాంబగారూ, అసలు కథంతా ముందే వుంది.....'

'చెప్పమ్మా. చెప్పు-'

'అప్పుడు శాస్త్రులుగారు - మా వాళ్లు ముగ్గురినీ మర్యాదగా కూర్చొబెట్టి, వాళ్లు వచ్చిన సమాచారం కనుక్కుని, తాపీగా బీరువాలోంచి ఓ పెద్ద బైండ్ పుస్తకం పదినిముషాలు వెదికి మరీ బయటకు తీశాట్టండీ!'

'బైండ్ పుస్తకమా? ఎందుకూ, వాడి శ్రాద్ధం పెట్టటానికా? 'ఆ పుస్తకంతో మా వాళ్లు ముందుమారు వచ్చినప్పుడు వ్రాసిన లిస్టు వివరాలు చదివి, యిదుగో నేను "అమ్మాయి" అని చెప్పాను. కావలంటే ఈ పుస్తకం చూడండి. ఇప్పుడు రాయులేదుగా నేను!' అని వాళ్ల ముందు పెట్టాడటండీ!.... "మీకు కొడుకు కావాలని వుంది. అందుకని నేను అలాగే చెప్పాను అనుకున్నారు. సరి సరి... సెర్చి ఫీజు కింద మరో పదిరూపాయిలు ఇక్కడ పెట్టండి" అన్నాడట!

'ఆరి వాడి కడుపుడక! ఎంత మాయచేశాడు!'

'మాయ-మర్మం కాదండీ, జగదాంబ గారూ! తరువాత మా నాన్నగారు కలిస్తే తెలిసింది. ఆ శాస్త్రులు ఎప్పుడూ చెప్పేదీ-వ్రాసేదీ వేరువేరుగా వుంటుందిట! చెప్పిన ప్రకారమే జరిగితే ఎవరూ తగాదాకు రారు. అలా కాకుండా నా మాదిరి తిరగబడిన కేసులు అయితే అలా బైండ్ పుస్తకం చూపి తప్పించుకుంటాట్ట? మరో పదిరూపాయిలు సంపాదనకూడాను!'

'ఏం తెలివి తేటలు! ఏం తెలివి తేటలు!!...'

'-అప్పుడు మా అమ్మా, అమ్మమ్మా, నాయనమ్మా ఆయన్ను ఇంకేమీ అనలేక యింటికి చక్కావచ్చేశారట! మా నాన్నగారేమో ప్రశ్నశాస్త్రులుగార్నే బోల్తాకొట్టించినది గనుక ఈ పిల్లపేరు "ప్రశ్న" అన్నారట!

'మీ నాన్న బృహస్పతి సుమా!'

'కాదండీ. హైకోర్టులో అడ్వకేట్'

'నువ్వు బుద్ధిమంతురాలివి తల్లీ. నీవు బాగా చదువుకుని అడ్వకేట్ అవాలి! తరువాత జడ్జికూడా అవ్వాలి!'

'కాదండీ, నేను సైంటిస్ట్ అవాలను కుంటున్నాను!'

'ఒద్దు, జడ్జీయే బాగుంటుంది....'

'జగదాంబ... కొడుకులు, కోడళ్ల విషయంలోనే మనకేం అధికారం లేదుగదా! ఏదో లాంఛనంగా ఓ పువ్వులగుత్తి ఇచ్చిపోదామని వచ్చిన ఈ అమ్మాయి మీదనా మన అధారిటీ!'

మళ్లీ ఎవరో తలుపు తట్టారు.

సుందరమ్మ బయటకు తలపెట్టి చూచింది.

జయమ్మ కాఫీ తెచ్చి ముగ్గురికీ ఇచ్చింది.

'థాంక్స్' అంది ప్రశ్న.

జగదాంబ అలమారులో వున్న బిస్కట్ల డబ్బాతీసి 'నీకు స్వీట్ బిస్కెట్ కావాలా, సాల్ట్ బిస్కట్టా?' అని అడిగింది ప్రశ్నను.

'రెండూ ఇవ్వు' అంది సుందరమ్మ.

జగదాంబ ఆమెవయిపు కొరకొర చూచి రెండు బిస్కట్లు ప్రశ్నకు అందించింది. 'నాకెం వద్దు యిప్పుడు' అంది సుందరమ్మ. 'తిను, పొద్దున్న కూడా ఉత్త కాఫీయే తాగావు' అని బలవంతంగా జగదాంబ ఆమెకు రెండు బిస్కట్లు యిచ్చింది.

కాఫీ అయ్యాక 'ఈ రోజంతా యిక్కడ వుండిపో, అమ్మాయి, కులాసాగా కబుర్లు చెప్పకుందాం' అంది జగదాంబ.

'కుదరదండీ, నేను వెంటనే వెళ్లి చదువుకోవాలి, రేపు ఫిజిక్స్ పరీక్ష!' అంది ప్రశ్న.

'నా మనమరాలు నీ ఈడుదే, దానికి యిద్దరు అన్న తమ్ముళ్లు వున్నారు.'

'ఎవరు? ఢిల్లీలో వున్నవాళ్లా?'

'కాదు, ఢిల్లీలో వున్నది నా కొడుకు. నేను చెబుతూ వున్నది పూనాలో వున్న అమ్మాయిని గురించి- '

కాస్సేపాగి 'ఒకసారి యేమయిందనుకున్నారు?' అని ప్రారంభం చేసింది జగదాంబ.

ప్రశ్నకు యింక లేచి వెళ్లి పోదాం అనిపించింది.

'అప్పుడు నేను గుంటూర్లో వున్నానే, మా అమ్మాయి దగ్గర. మా మనమరాలికి అయిదో పుట్టిన రోజు. విజయవాడలో వున్నారు అబ్బాయీ-కోడలూ. సాయంత్రం గుంటూరుకు వచ్చేస్తాం అన్నారు. తీరా అర్థరాత్రికిగాని రాలేదు. నేను కంగారు పడిపోయాననుకో.'

'దారిలో యేమన్నా యాక్సిడెంటా?'


'కాదు ప్రసవం కేసులో ఆలస్యం అయింది కోడలుకు!'

'మీ అబ్బాయి కాలేజి ప్రిన్సిపాల్ అన్నావు గదూ!'

'కాదు. బ్యాంక్‌లో జనరల్ మేనేజర్.'

'ఆ అమ్మాయినే వాళ్ల అబ్బాయికి చేసుకున్నారా?'

'మా అబ్బాయికి చేసుకోవాలనే వుండేది గాని..... కోడలు పడనీయలేదు. దగ్గరి సంబంధం



చేసుకుంటే అవకరాలు వస్తాయిట!'

'డాక్టర్ కదూ ఆమె!'

'అన్నీ దాఖలాలు చూపించి మాట్లాడితే నేను నోరెత్తలేకపోయాను!'

-ప్రశ్న అంత వరకు పైకప్పు వంక చూస్తూ వుండిపోయింది. వాళ్ల మాటలు కాస్త ఆగినట్లు పసిగట్టి, 'నాకు సెలవు యిస్తె, వెళ్లి వస్తానండీ!' అని లేచింది.

'అప్పుడే వెళ్లి పోతావా అమ్మా-' అని జగదాంబ అడిగితే, 'మళ్లీ ఎప్పుడు వస్తావు?' అంది సుందరమ్మ.

ప్రశ్నకు మరెం జవాబు చెప్పాలో తెలియకుండా పోయింది.

-సోషల్ సర్వీస్ పేపర్లో మార్కులు కలుస్తాయని పుష్పగుచ్ఛం తీసుకువచ్చింది యిక్కడకు. ఇవాళే చివరిరోజు గనుక తప్పనిసరిగా ఈపనికోసం యిక్కడకు రావడం, తానుచేసిన ఈ కొద్దిపాటి పనికి జగదాంబగారు సంతోషపడడం, ప్రశ్నకు ఆనందంగానే వుంది.

'మళ్లీ ఎప్పుడో ఒకప్పుడు రామ్మా, మా దగ్గరకు, ఒకమారు వచ్చిన వాళ్లు మళ్లీరారు, ఎందుచేతనో! -' అంది జగదాంబ.

'బంధువలకే పట్టదు-'

'అందరికీ అనేక పన్లు, మనకయితే యేం పనీపాటు లేదు గనుక యివన్నీ అనుకుంటూ కూర్చుంటాం-'

ప్రశ్న ముందుకు అడుగు వేసింది.

'వస్తానండీ. ఆలస్యం అయితే అమ్మ కోపం చేస్తుంది.'

'ఎప్పుడయినా అమ్మను తీసుకురామ్మా-'

'అలాగే చెబుతానండీ!' అంది ప్రశ్న, వాళ్లిద్దరికీ నమస్కారం చేసి గుమ్మంవయిపు రెండడుగులు వేసింది.

'పుష్పగుచ్ఛం చాలా అందంగా వుందమ్మా-'

-దీని తయారీకి అరవై మార్కులు వచ్చాయి. ఇక్కడకు తీసుకు వచ్చి యిచ్చినందుకు మరో ముప్పై మార్కులన్నా కలుస్తాయి... అని అంచెనా వేసుకుంటుంది ప్రశ్న. ధీమాగా నవ్వింది.

'అమ్మాయిని కిందకు పంపివస్తాను-' అంది సుందరమ్మ.

'నేను కూడా వద్దును, కళ్లు మగతలు, కాళ్లు మడతలు పడుతున్నాయి నడవలేను-' అంది జగదాంబ.

'ఎందుకండీ. అక్కర్లేదు. నేను వెళ్లగలను,' అంది ప్రశ్న.

ఇద్దరూ కిందకు వచ్చారు. రిసెప్షనిస్ట్ ఆఫీసు గదికి వెళ్లమంది. వార్డెన్ ప్రశ్నకు సర్టిఫికెట్ అందించింది, పుష్పగుచ్ఛం యిచ్చినట్లు, ఓ గంటసేపు సదను వాళ్లతో సత్కాలక్షేపం చేసినట్లు. భద్రంగా ఆ కాగితాన్ని పర్సులో దాచుకుంది ప్రశ్న. వార్డెను సెలవుయిస్తు 'మాతో పాటు భోజనానికి వుండిపోతావనుకున్నాను,' అంది. సుందరమ్మ 'నేను చెప్పాను. అమ్మాయి చదువుకోవాలట! వెడతానని మొండితనం చేస్తే విధిలేక ఊరుకుండిపోయాను-' అంది. ప్రశ్న నవ్వుకుంది.

బయటకు వచ్చాక, 'ఇవాళ నీవు రావడం జగదాంబకు ఎంత సంతోషంగావుందో తెలుసా?' అంది ప్రశ్నతో, సుందరమ్మ.

'ఎందుకని?' - మొదటిమారుగా ప్రశ్న వేసింది.

'ఈ రోజు జగదాంబ పుట్టినరోజు. సాదా సీదా పుట్టినరోజు అనుకుంటున్నావా? జగదాంబకు ఇవాళ షష్టిపూర్తి -' అంది సుందరమ్మ.

బస్ వచ్చేస్తోందని ప్రశ్న పరుగుతీసింది, అలవాటుగా తల క్షణంపాటు పక్కకు తిప్పి, చేయి ఊపుతూ. ★

*With Best Compliments From :*

**SRI KRISHNAVENI EDUCATIONAL INSTITUTIONS**

*(VIJAYAWADA)*

**Sri Krishnaveni Engineer's College**
Patamata, VIJAYAWADA-7. Ph: 477495

**Sri Krishnaveni Residential College**
K.C.P. Colony, VIJAYAWADA-7. Ph: 58449

**Sri Krishnaveni Residential High School**
K.C.P. Colony, VIJAYAWADA-7. Ph: 58449

**Sri Krishnaveni Public School**
VIJAYAWADA. Ph: 58313

**Sri Krishnaveni Science (Junior) College**
Patamatalanka, Bundar Road, VIJAYAWADA-14. Ph: 477745

**Sri Krishnaveni Talent School**
Patamatalanka, Bundar Road, VIJAYAWADA-14. Ph: 477745